# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆయుర్వేద రంగంలో పరిశ్రమల స్థాపనకు యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- "ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన" కింద 2028 వరకూ ఉచితంగా బియ్యం పంపిణీ చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం తెలిపింది.
- అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- నాణ్యమైన ఔషధాలు తయారీకి భారతదేశం కీలక కేంద్రంగా ఆవిర్భవించిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.
- కజకిస్థాన్ లోని ఆస్తానాలో జరుగుతున్న ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ లో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించింది.

==========================

ఆయుర్వేద రంగంలో పరిశ్రమల స్థాపనకు యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఢిల్లీలో ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) 8వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఈ రోజు ఆమె కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఆయుర్వేద రంగంలో పరిశ్రమలు ఏర్పాటు ద్వారా సంప్రదాయ ఔషధాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావచ్చని అన్నారు. ఆయుర్వేదం ఎల్లప్పుడూ ప్రజల జీవితంలో అంతర్భాగంగా ఉందని రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

కాగా, ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము శాశ్వత ఆయుష్ ప్రదర్శన, ఆయుష్ ఔషధి కేంద్రాలను ఆవిష్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన”తో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. 2028 డిసెంబర్ వరకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రి వర్గం నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులకు తెలియచేస్తూ.... రాజస్థాన్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో నిర్మించనున్న 2 వేల 280 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. ఈ ప్రాజెక్టులకు 4 వేల 400 కోట్ల రూపాయలకు పైగా ఖర్చవుతుందని తెలియజేశారు. అదే విధంగా “వికాస్ భీ విరాసత్ భీ” కార్యక్రమంలో భాగంగా గుజరాత్ లోని లోథాల్ లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మహారాష్ట్రలో 7,600 కోట్ల రూపాయల పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఈ రోజు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహారాష్ట్ర అభివృద్ధి కోసం గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మరాఠీ భాషకు ప్రాచీన భాషా హోదా కేంద్ర ప్రభుత్వం కల్పించిందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

కాగా, నాగ్ పూర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునీకరణకు, షిర్డీ విమానాశ్రయంలో 645 కోట్ల రూపాయల విలువైన నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాణ్యమైన ఔషధాల తయారీకు భారతదేశం కీలక కేంద్రంగా ఆవిర్భవించిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఇతర దేశాల ఉత్పత్తులపైన ఆధారపడకుండా దేశీయంగానే మందుల తయారీకి “మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమం ఎంతగానో దోహదపడిందని అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 6వ సీఐఐ ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ... దేశీయ ఔషద తయారీ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా భారత్ స్వయం సమృద్ధిని పెంపొందించుకోవడమే కాకుండా కీలకమైన ఆరోగ్య సంరక్షణ సరఫరాలు తక్షణమే అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కాగా, ఔషధ ఉత్పత్తిలో భారతదేశం 3వ  స్థానంలో ఉందని ఆయన గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కజకిస్థాన్ లోని ఆస్తానాలో జరుగుతున్న ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ లో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించింది. మహిళల టీమ్ విభాగంలో  దేశానికి పతకం రావడం ఇదే తొలిసారి. సెమీ ఫైనల్లో భారత్ 1-3 తేడాతో జపాన్ జట్టుపై ఓడిపోగా, మరో సెమీఫైనల్లో చైనా 3-0 తేడాతో హాంకాంగ్ చేతిలో ఓడింది. ఈ పోటీలో ఓడిన ఇద్దరికీ కాంస్య పతకాలు ప్రదానం చేస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ రేపటి నుంచి రెండు రోజుల పాటు లావోస్ లోని వియంటియాన్ లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 21వ ఏసియాన్-ఇండియా సదస్సు, 19వ తూర్పు ఆసియా సదస్సులో నరేంద్ర మోదీ పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి జైదీప్ మజుందార్ తెలిపారు. ఆ వివరాలను ఈ రోజు ఆయన న్యూఢిల్లీలో పాత్రికేయులకు తెలిపారు. ఏసియాన్ - ఇండియా శిఖరాగ్ర సదస్సుకు ప్రధానమంత్రి  హాజరుకావడం ఇది 10వ సారి అని, లావోస్ ప్రధానమంత్రి సోనెక్సే సిఫాండోన్ ఆహ్వానం మేరకు భారత ప్రధానమంత్రి వియంటియాన్ లో పర్యటిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నరేంద్ర మోదీ, ఏసియాన్ దేశాల ప్రభుత్వాధినేతలతో కలిసి భారత్, ఏసియాన్ దేశాల మధ్య సంబంధాల పురోగతిని సమీక్షిస్తారని జైదీప్ మజుందార్ తెలియజేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ఈ సంవత్సరం ముగ్గురుకు ప్రకటించారు. ప్రొటీన్‌పై అధ్యయనం నిర్వహించిన డేవిడ్ బాకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం. జంపర్ ఈ అవార్డును పంచుకోనున్నారని ఈ రోజు నోబెల్ బృందం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వర్ రావు పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసంవత్సరం పొడిగించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల సంఘం (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఈరోజు నుంచి సంవత్సరం పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఆయన పదవీకాలం కొనసాగుతుందని ఏసీసీ పేర్కొంది. 1984లో ఆర్‌బీఐలో చేరిన ఆయన పలు కీలక పదవులు నిర్వహించారు. 2020 అక్టోబర్‌లో డిప్యూటీ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఇద్దరు ఆర్మీ జవాన్లను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన ఘటనలో ఒకరు మృతి చెందారని ఆర్మీ అధికార వర్గాలు తెలిపాయి. భద్రతా దళాలు కిడ్నాప్ అయిన ఆర్మీ జవాన్ల కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన క్రమంలో కిడ్నాప్‌కు గురైన ఇద్దరు జవాన్లలో అహ్మాద్ భట్ ను కనుగొన్నారు. అనంత్‌నాగ్ జిల్లాలోని ఉత్రాసులోని సాంగ్లాన్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు బుల్లెట్ గాయాలతో అహ్మాద్ భట్ కనిపించారు. దీంతో ఆ జవాన్‌ని వెంటనే చికిత్స కోసం భద్రతా సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, కిడ్నాప్‌కు గురైన మరో జవాన్ మృతి చెందారని, మృతి చెందిన జవాను శరీరంపై బుల్లెట్ గాయాలు ఉన్నట్లుగా గుర్తించామని ఆర్మీ అధికార వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 13 నుండి 19వ తేదీ వరకూ 7 రోజుల పాటు అల్జీరియా, మౌరిటానియా, మలావి దేశాలలో పర్యటించనున్నారని కేంద్ర ప్రభుత్వ  అధికార వర్గాలు తెలిపాయి. అల్జీరియా అధ్యక్షులు అబ్దెల్ మజీద్ టెబ్బౌన్ ఆహ్వానం మేరకు రాష్ట్రపతి  ద్రౌపది ముర్ము ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఆ దేశంలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ఆ దేశ విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే, ఈ నెల 16 నుండి మౌరిటానియాలో రాష్ట్రపతి పర్యటించనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల టి-20 ప్రపంచకప్ లో ఈరోజు భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య దుబాయి వేదికగా క్రికెట్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమయ్యింది. టాస్ గెలిచి బాటింగ్ ఎంచుకున్న భారత్ 8 గంటల సమయానికి వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది. ఈ ప్రపంచ కప్ లో భారత్ సెమీఫైనల్ కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్ లో విజయం చాలా కీలకం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =